కడపటికి 'బ్రహ్మర్షి' అని వసిష్ఠులవారి చేతనే అనిపించుకోగలిగాడు.

ఒక పౌర్ణిమనాడు వసిష్ఠుడు చల్లని, చక్కని వెన్నెలలో అరుంధతితో ఒక గుట్టపై కూర్చొని వుండగా అతనిని ఏవిదంగానైనా హతమార్చాలని విశ్వామిత్రులవారు చక్కని ఖడ్గమును తీసుకొని వెళ్ళి ఆ కొండ దగ్గరలో ఒక పొదలో దాగి వున్నాడు. అతని శిరస్సు ఖండించటానికి అన్నివిధాలా విశ్వామిత్రుడు సిద్ధముగా వున్నాడు. ఈ సమయములో వసిష్ఠఅరుంధతులు సంభాషించుకుంటున్నారు. అరుంధతి, 'ఈనాడు పూర్ణపౌర్ణమి చంద్రుడు ఎంత తెల్లగా, ఎంత చల్లగా ప్రకాశిస్తున్నాడో! ఇంత పరిశుద్ధమైన పూర్ణిమను నేనెన్నడూ చూడలేదు కదా!' అన్నది. వసిష్ఠుడు, 'అవును అరుంధతీ! ఈ పవిత్రత, చల్లదనము, ఈ పరిశుద్ధత విశ్వామిత్రుని తపశ్శక్తి వలననే' అన్నాడు. ఈ మాట వినేటప్పటికి విశ్వామిత్రుని హృదయము చాలా మార్పుచెందింది. ' ఈ వసిష్ఠుల వారిది గొప్ప హృదయము! భార్యలవద్ద నిజమైన సత్యాన్ని నిరూపించటం పురుషుల లక్షణం. అలాంటిది నా తపశ్శక్తిని భార్యవద్ద ఎంతగొప్పగా వర్ణిస్తున్నాడు. నాదే దుర్మార్గము' అని ఆ కత్తిని పారవేసి, పరుగెత్తివచ్చి వసిష్ఠుని పాదములపై పడినాడు. ఈ దృశ్యమును చూచిన వసిష్ఠులవారు 'బ్రహ్మర్షీ! లెమ్ము' అన్నాడు. విశ్వామిత్రునికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. 'ఇంత కాలము, ఇంత తపఃశ్శక్తిని సంపాదించినపటికీనన్ను రాజర్షి అని పిలిచిన వసిష్ఠుడు ఈనాడు నేను దుర్మార్గమునకు పూనుకొన్నప్పుడు 'బ్రహ్మర్షి' అని పిలుచుటలోగల అంతరార్థమును అడిగి తెలుసుకోవా' లనుకున్నాడు. అప్పుడు వసిష్ఠుడు, 'విశ్వామిత్రా! ఇంతకాలము నీ నఖశిఖ పర్యంతము అహంకారము నిండి వుండినది. నీవు ఎవరికీ తలవంచేవాడవుకాదు. లొంగేటువంటివాడవు కాదు. ఈవిధమైన అహంకారముచేత నీవు స్వేచ్ఛావిహారము సలుపుతూ వచ్చావు. నీ శిరస్సును వంచి, లొంగినట్లుగా పాదాక్రాంతుడవైనావు. ఇప్పటినుంచీ నీవు బ్రహ్మర్షివి' అన్నాడు. దీని అంతరార్థమేమిటి? అహంకారముతో వుండినంత వరకు, అసూయ అనేది అన్నివిధాలా హింసిస్తూ వుంటుంది. ఏనాడు అహంకారము పోయి వినయవిధేయతలతో వుంటామో ఆనాడు మన పేరుప్రతిష్ఠలు వ్యాప్తికావటానికి అవకాశం వుంటుంది. అహంకారముతో వుండటంచేత అతనిని రాజర్షి అన్నారు. రజోగుణ సంపత్తి కలిగినవాడు రాజర్షి. ఏనాడు రజోగుణము పోయి, సాత్విక లక్షణమైన వినయవిధేయతలతో ప్రవర్తిస్తామో, ఆనాడు పవిత్రత మనకు ఏర్పడుతుంది. క్రమక్రమేణా మనము వినయవిధేయతలతో ప్రవర్తించటానికి ప్రయత్నిస్తే మన హృదయానికి ఈ అహంకార, అసూయలు సాధ్యమైనంతవరకు దూరముచేయటానికి అవకాశం వుంటుంది.

**గాయత్రీమంత్ర ప్రదాత**

విశ్వామిత్రుడు లోకమునకు చాటిన మహావాక్యములలో గాయత్రీ మంత్రము ప్రధానమైనది. సర్వమతములవారికి, సర్వదేశములవారికి, సర్వ అవస్థలకును, సర్వవర్ణములకు కూడను ఇది సమత్వమైనటువంటిదనీ, సమన్వయమైన తత్త్వమనీ నిరూపించాడు. ఇది కేవలము బుద్ధికి సంబంధించిన మంత్రమే తప్ప, మతమునకు సంబంధించినది కాదు. ధియో యోనః ప్రచోదయాత్'. నా బుద్ధియొక్క బలమును వికసింపచేసి, అజ్ఞానమనే చీకటిని దూరము చేసి, ప్రజ్ఞానమనే వెలుతురులో నాయొక్క తత్త్వమును నిరూపించమని కోరుతూ వచ్చాడు. అంతియేకాదు, 'భూర్భువస్సువః తత్ సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి'. 'ఓ త్రికాలము లందున్నటువంటి పరమాత్మా! త్రిలోకములందున్నటువంటి పరమాత్మా! త్రిగుణము లందున్నటువంటి పరమాత్మా! నాయొక్క అజ్ఞానమనే చీకటిని పారద్రోలు' అని అర్థము.

**ప్రజ్ఞానతత్త్వం**

జీవితము బాల్యము, యవ్వనము, వార్ధక్యము అని మూడు కాలములుగా ఉంటున్నది. ఇదే త్రిలోకములుగా తాను భావించుకొంటూ వచ్చాడు. కాని, బాల్యము, యవ్వనము, వార్ధక్యము ఈమూడుకూడను, కాలములోని మార్పులే తప్ప ప్రత్యేకమైనవి కావు. బాల్యమునందే యవ్వనము ఉంటున్నాది. యవ్వనమునందే వార్ధక్యము ఉంటున్నాది. అవి ఒకదానికొకటి భిన్నమైనవి కాదు. అలాంటి ఏకత్వమైన ప్రజ్ఞానతత్త్వమును నిరూపించుతూ వచ్చినవాడు విశ్వామిత్రుడు. ఈ ప్రజ్ఞానము వలన నూతన సృష్టినికూడను గావించినవాడు విశ్వామిత్రుడు. దానినే త్రిశంకు స్వర్గమన్నారు. ఇలాంటి సృష్టిని కల్పింపచేసినది ప్రజ్ఞానముయొక్క తత్త్వము తప్ప అన్యము కాదు.